# శ్రీలత శతకము



నిత్య జీవన సత్యాలనే

సరళమైన భాషలో

ఏరి కూర్చిన హృద్యమైన

పద్యమాల

# శ్రీలత శతకము

# శ్రీలత శతకము

© with the Writer

ప్రచురణ : ఆగస్టు, 2000

ప్రతులు : 1000

మూల్యం : రూ. 25/-

ప్రతులకు :

శ్రీ ఎం. కొండయ్య, ఎం.ఎస్.సి.
ప్రవర్ధన్ సీడ్స్ ప్రై. లి.,
భూత్‌పూర్, మహబూబ్‌నగర్ జిల్లా - 509 382.
ఫోన్: 08542-36204, 36205, 36231.
ఆఫీస్:
8-11, లాల్‌బహదూర్ స్టేడియం, హైదరాబాద్ - 500 001.
ఫోన్ : 040-237917, 233397

2. విశాలాంధ్ర పబ్లికేషన్స్ అన్ని శాఖలు.
3. నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్.
4. దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్.
5. ప్రగతి బుక్ హౌస్, విజయవాడ.
6. నవోదయ బుక్ స్టాల్, గుంటూరు.

ముఖచిత్రం :
సి.హెచ్. శేఖర్, వి.ఎస్.ఎస్. లేజర్ గ్రాఫిక్స్

ముద్రణ :
దీప్తి ప్రింటర్స్, లకిడికాపూల్,
హైదరాబాద్ - 500 004. ఫోన్ : 3310321.

SIRI - SRUTHI PUBLICATIONS

# మీతో...

చెప్పాలనుకున్న కవి అనుభవాలకూ, అనుభూతులకూ అధ్యయనానికి, అభిప్రాయాలకూ, ఆవేశానికీ రచనం ఎన్నో విధాలు! అందులో శతక రచనం ఒక ప్రక్రియ! ఏ ప్రక్రియకైన లక్షణాలు రాసిన తరువాత ప్రక్రియ రాదు. ప్రక్రియ వచ్చిన తరువాత లక్షణాలు రాయబడతాయి లాక్షిణుకుల చేత! ఒకే ప్రక్రియ కాలానుగుణంగా కవికనుగుణంగా తన లక్షణాలను మూపుకుంటూ లేదా మార్చుకుంటూ కొనసాగుతూనే ఉంటుంది. లక్షణాలు మారినంత మాత్రాన అది సాహితీ ప్రక్రియ కాదు అనడానికి మనకెలాంటి హక్కు లేదు. ఆ ప్రక్రియ మారిన ప్రక్రియగా లేదా కొత్త ప్రక్రియగా గుర్తించబడి తీరుతుంది!

వృషాధిప శతకం, సుమతీ శతకం, కాళహస్తీశ్వర శతకం, వేమన శతకం, భాస్కర శతకం, దాశరథి శతకం... తదితర శతకాలను నాకు ముందుగా వారసత్వం ఇచ్చిన శతక కర్తలందరికీ అభివందనం. ఈ శతకాలను అధ్యయనం చేసిన లాక్షిణికులు శతక లక్షణాలను కొన్నింటిని రూపొందించడం జరిగింది. అవి ముక్తకం. ఏకసూత్ర లేని లక్షణం. సంఖ్యా నియమము 108 లేక 101. మకుట నియమం, రస, భాషా, ఆత్మాశ్రయ, వస్త్వాశ్రయ, అంకిత నియమం. ఈ శతకానికి ముక్తికం... సంఖ్యా నియమం, మకుట నియమం, భాషా నియమం (అనగా వ్యవహారిక భాష), ఆత్మాశ్రయ, అంకిత నియమం పాటించును. ఇక రస విషయానికొస్తే వేమన శతకంలో రస నియమం వుందా లేదా అనే అంశం చర్చనీయాంశం అయి వేమన గారిది వేదాంత రసం అని తేటతెల్లమైంది.

అందుకే శతకంలోని కొన్ని లక్షణాలను తీసుకుని కొన్ని లక్షణాలను మార్చుకుని, కొన్ని లక్షణాలను వదులుకుని నాదైన శైలిలో శతక ప్రక్రియ చేపట్టి నేను పొందిన అనుభవాలు, అనుభూతులూ, అభిప్రాయాలూ, ఆదర్శాలూ, ఆవేశాలూ నేను వెలువరించాను.

నవ్వనియండి పగలబడి!! నలుగుర్ని నను చూచి
మరలి తీరుదురు వారు!! నా దారి మంచిదని తెలిసి

అందుకే నేను కూడా ఒక ప్రత్యేక రస నియమాన్ని పాటించలేదు. అందువల్ల చదువరులు మాత్రమే ఇది ఏ రస నియమమెూ నిర్ణయించుకోగలరు.

ఇందులో నేను తీసుకున్న పాత శతక లక్షణాలలో

1. వంద పద్యాలుండడం
2. మగుటంగా సిరిలత మువ్వా
3. ప్రతి పద్యమూ తనదైన ఒక అభిప్రాయాన్ని లేదా అనుభవాన్ని కలిగి ఉండడం.

ఈ స్ఫూర్తితో సాగిన నేను నాకంటే ముందు శతక ప్రక్రియలో తమదైన ఆలోచనలు వెలువరించిన శతక కర్తలందరికి అభివాదము తెలుపుతూ నా శతకాన్ని మొదలుపెట్టాను.

మీ

**శ్రీలత**

# కింకిణీకము

శ్రీరస్తు - శుభమస్తు

శ్రీరస్తు - చిరంజీవిని సౌభాగ్యవతి శ్రీమతి

సుప్రసిద్ధ రచయిత్రి

స్వాతి నవనవలికల పోటీలో బహుమతి ఆర్జించిన ''వెన్నెల స్పర్శ'' ఈమె ఆర్జించిన కీర్తిని ద్విగుణీకృతం చేసినది. శ్రీమతి శ్రీలత గూర్చి రచయిత్రిగా చెప్పవలసిన విశేషం ఈమె ''ఆలోచనాశాలిని''.

ఆలోచిస్తుంది. ఆలోచింపచేస్తుంది ఈమె కలం. అది కథానిక కావచ్చు. పెద్ద కథ కావచ్చు. చిన్న నవల కావచ్చు. యావత్ ప్రపంచాన్ని కదిపి కుదిపిన మార్క్సు మనీషి అన్న మాట -

''ప్రపంచ కార్మికులారా! ఏకము గండు
మీకు పోయినదేమి త్రుప్పపట్టిన సంకెళ్లు తప్ప''

ప్రపంచంలో కార్మికులే కాక, పలువురు ప్రజలు ఉన్నారు గద.

''మేలుకొనుడు- లెండు- మేధావులే వారు.
సృష్టికపర సృష్టి చేయగలరు''-

శ్రీమతి లత గారు - చదువరుల మెదడు కదిపి కుదుపగల రచయిత్రి. సందేహం లేదు.
శ్రీమతి లత ఇపుడు వ్రాసిన కావ్యం

''సిరిలత మువ్వా''

ఇది శతకం.

ఆంధ్రవాఙ్మయం శతకమునకు ఒక విశిష్టస్థానం ఉన్నది. శతకం వంద పద్యాల సమాహారం.

సిరిలత మువ్వాలో వంద పద్యాలు ఉన్నాయి.

శతకం ఆత్మనివేదనవు. భగవంతునికో, సరస్వతికో, మిత్రునికో, అంతరాత్మకో శతకం - రచయిత ''బహిరంగ స్వగతం''

నాటక పరిభాషలో చెప్పవలెనంటే శతకమునకు ఒక మకుటం ఉంటుంది. ఈ శతకమునకు మకుటం ''సిరిలత మువ్వా''

ఇది కవయిత్రి - తన అంతరాత్మకు చేసిన విన్నపములు. కవయిత్రి అంతరాత్మకు పెట్టుకొనిన మొర. ఈ మొఱ-దండోరా ధ్వని కాదు. కంచు ఢంకా మ్రోత కాదు. మువ్వల కలకల కల రకము. కలవరము.

ఎదుగుతుంటే వర్షించే వారం
ఎక్కడో ఒక్కరు సిరిలతమువ్వా
క్షీణిస్తుంటే సంతోషపడే వారు
అంగుళానికొక్కరు సిరిలత మువ్వా

వంటి శాశ్వత నిత్యసత్యాల సంపుటి ఈ శతకం.
''జీవితం బయటకు రానీని పద్మవ్యూహం''
ఈ కవయిత్రిలో- భావయితి కారాయిత్రి కూలంకషంగా

గంగాయమునల వలె సంగమించినవి. అంతర్లీన సరస్వతీ ప్రవాహం లత భావుకత. లత సరస్వతీ.

ఎవరైనా ఒక విమర్శ లేవదీయవచ్చు. ''లత గారు వ్రాసిన ఈ పద్యాలలో ఛందస్సు లేదు'' అని. ఈ లత సిరిమువ్వ. కావ్యంలోని నూరుపద్యాలు వచన కవితలు. ఈ వచన పద్యాలలో ''నిర్ణీత సాంప్రదాయికమ్మైన ఛందస్సు లేదు.

శబ్దమేది లేదు – ఛందస్సు లేకుండ
యతి గణములు ప్రాస కృతకో మిషలు;
మెరపు తీగవంటి మేటి భావమో సుమా
ప్రాణనాడి కవిత కంతరాత్మ

కవయిత్రి శ్రీమతి లత వ్రాసిన సిరిలత శతకం
మిరుమిట్లు గొలిపే మెరుపు తీగల పుట్ట.

కవయిత్రి శ్రీరస్తు చిరంజీవిని సౌభాగ్యవతి శ్రీమతి లత – భవిష్యత్తులో మరికొన్ని గొప్ప కావ్యాలు వ్రాసి సహృదయులను పులకింపజేయగలరని ఆశించుచున్నాను ఆశీస్సులందించు చున్నాను.

కడలి అలలు చాలు – కమ్మ తెమ్మెర చాలు
మొగ్గచాలు కాళ్ల మువ్వ చాలు
వెన్నెల సిరి చాలు – కన్ను మూతలు చాలు
ప్రతిభ – పొంగి పొరలు – లతకు హృదిని

-డా. నందూరి రామకృష్ణమాచార్య

1) సుఖం లోంచి పుట్టే వాదం అలలాగ
క్షణికం అది నిలవదు సిరిలత మువ్వా!
ఘర్షణలోంచి పుట్టే వేదం సెగలాగ
కణికం అది ఆరదు సిరిలత మువ్వా!

2) ఓటి కుండలో నీరెంత నింపినా
ఒక్క చుక్క నిలవదు సిరిలత మువ్వా!
గాటు గుండెకూ మాట్లెన్ని వేసినా
జీవించి నవ్వదు సిరిలత మువ్వా!

3) కొన్ని వాగ్దానాలు నీటి మీది రాతలు
నిలపాలన్నా నిలవవు సిరిలత మువ్వా!
కొన్ని జ్ఞాపకాలు కఠిన శిలాక్షరాలు
చెరపాలన్నా చెరగవు సిరిలత మువ్వా!

4) ఎదుగుతుంటే హర్షించే వారు
ఎక్కడో ఒక్కరు సిరిలత మువ్వా!
క్షీణిస్తుంటే సంతోషపడేవారు
అంగుళానికొక్కరు సిరిలత మువ్వా!

5) గెలుస్తూ పోతే ప్రతి ఘడియలోనూ
అది జీవితమే కాదు సిరిలత మువ్వా!
ఓడిన ప్రతిసారి ఉవ్వెత్తునెగిసి
జీవించి చూపించు సిరిలత మువ్వా!

6) నవ్వితే తోడు నలుగురూ నవ్వేరు
నాల్గు రోజులా బ్రతుకు నవ్వుకో సిరిలత మువ్వా!
ఒక్క క్షణమైనా చుక్క కన్నీరు రాల్చితే
పుడమిపై సహశోకి దొరకరు సిరిలత మువ్వా!

7) గుండె గాటుకు రక్తపు చుక్కలు
జారినా ఏడ్చేందుకు స్వేచ్ఛ లేదు సిరిలత మువ్వా!
డాంబికపు నవ్వులై తేల్చుకుంటే
నగుబాటు అగుదువు సిరిలత మువ్వా!

8) యుగాల శోకమిది ఒక్క ఏడ్పుతో
ఎంత మాత్రం అయిపోదు సిరిలత మువ్వా!
మొండిగా ఎదుగుతూపో చుట్టూ ఉన్నవాళ్ళు
ఎలాగూ ఏడ్చిపెడతారు సిరిలత మువ్వా!

౯) శ్రామికుని శ్రమకు శరీరం అలిసి
కడుపు ఎండిపోయే సిరిలత మువ్వా!
సిద్ధాంతీకుని కృషికి మెదడు అలిసి
బ్రతుకు పండిపోయే సిరిలత మువ్వా!

౧౦) కనిపిస్తూ ప్రియతమ దరి చేరకపోతే
బాధ బ్రతకనివ్వదు సిరిలత మువ్వా!
దూరంగా ఉంటే కనుచూపు లేదని
వ్యధ బ్రతుకు నీయదు సిరిలత మువ్వా!

౧౧) పచ్చగడ్డి తిన్న ఆవు ఇచ్చే పాలు
పచ్చగా అసలు ఉండవు సిరిలత మువ్వా!
ఆరగించే దానికీ అభివ్యక్తం చేసేదానికీ
అంతరం అతి మెండు సిరిలత మువ్వా!

౧౨) పుట్టిన రోజులు పెళ్ళిరోజులు పండుగరోజులు
కావాలని ఆరాటం వద్దు సిరిలత మువ్వా!
గిట్టని రోజొక్కటి ప్రపంచము సెలవు రోజు
కావాలనే పోరాటం చాటు సిరిలత మువ్వా!

13) అనుభూతులు సమిధలు చేసి అనుభవాలు
ప్రజ్వరిల్లే యజ్ఞగుండం కావే సిరిలత మువ్వా!
సమిధలు కొరవైతే అజ్ఞపు అలుముకు
అగ్నిజ్వలనకు అర్పితసిద్ధాంతమైపోవేసిరిలత మువ్వా!

14) ప్రేమనేది మంచు కప్పిన నిప్ప
ఆదమరచి ఉండకు సిరిలత మువ్వా!
మొదట చల్లగా సేదదీర్చి ఒడిచేర్చి
పిదప రవ్వై రగిలించి తీరు సిరిలత మువ్వా!

15) మంచితనమంటూ ముడి కట్టుకుని నీవు
బ్రతుకంత మాడినా సిరిలత మువ్వా!
బ్రతికుండగానే చేతగాని తనమంటు
వెక్కిరించి చంపేరు సిరిలత మువ్వా!

16) చినుకెంత ఇబ్బందులు పడునో
ముత్యపు చిప్పను చేర సిరిలత మువ్వా!
మనిషన్ని సమస్యలలో చిక్కును
మంచి పనిని చేయబూని సిరిలత మువ్వా!

17) అన్నపూర్ణంటే సరి అయిన అర్థమది
తప్పి తెలుసుకో నీవు సిరిలత మువ్వా!
ఇంటిల్లి ఆకలికి అన్నమై నిండి
తాను మంచినీళ్ళ కుండయ్యేది సిరిలత మువ్వా!

18) అలముంపినపుడెల్లా పిచ్చుక గూటిని
కచ్చగట్టి కడుతూపో సిరిలత మువ్వా!
సంద్రమదే విసిగి ఎగిసిపడడం మాని
ఎండిపోయి తీరునులే సిరిలత మువ్వా!

19) తీపి జ్ఞాపికలు తలుచుకునేదెందుకు
అవి వీడిపోనే పోవు సిరిలత మువ్వా!
మరిచిపోయేందుకు మాత్రం క్షణక్షణం
మరణవేదన తప్పదు నీకు సిరిలత మువ్వా!

20) ముందు ముందు మంచి స్నేహమది
విశాలనంతంలో సహ విహంగం సిరిలత మువ్వా!
ప్రేమ నాటుకుని గుండెలో విష వృక్షమై
ఊడలు దింపి పంజరమయ్యె సిరిలత మువ్వా!

21) ప్రతీక్షణమూ తొండితనమై ఎదురు నిలిచిందని ఓడిపోతే
అది బ్రతికినా చావే సిరిలత మువ్వా!
ప్రతి లబ్‌డబ్‌ను మొండితనంగా మార్చుకుని గెలిస్తే
అది మరణించిన బ్రతుకే సిరిలత మువ్వా!

22) జీవితమే ప్రతిపక్షంగా ధర్మయుద్ధం
చేసే బ్రతుకులసలే అరుదులు సిరిలత మువ్వా!
అధర్మమే ఆయుధంగా జన్మలంతం
చేసే జీవులకే గొప్ప బిరుదులు సిరిలత మువ్వా!

23) నవ్వుతూ నలుగురినీ నవ్వించి తీరుదాము
అదొక్కటి మనకి చాతనవును సిరిలత మువ్వా!
మరణానికి ముందు ఎలాగూ
దుఃఖాలను దూరం చెయ్యలేము సిరిలత మువ్వా!

24) కాలి కింద దుమ్మయినా దాహం తీర్చే కుండయినా
మట్టి ఒక్కటే ధరిత్రి ఉదరంపై సిరిలత మువ్వా!
చీత్కారం రేపినా సత్కారం జరిపినా
మన నడవదొక్కటే బ్రతుకు దారిపై సిరిలత మువ్వా!

25) పెద్దతనం పోసుకుని శవాలు చలామణీ
చెలాయిస్తూ జీవితాలనేలుతుంటే సిరిలత మువ్వా!
మంచితనం చంపుకుని మానవులు కొందరు
జీవశ్చవాలై జీవిస్తున్నారు సిరిలత మువ్వా!

26) రాజ్యాలు భోగాలు భాగ్యాలు లలనామణులు
ఎన్నో సాధించవచ్చు సామర్థ్యంతో సిరిలత మువ్వా!
ఒక్కటంటే ఒక్క పెదవులపై చిన్ని చిరునవ్వు
పూయించలేవు అనురాగం లేకుంటె సిరిలత మువ్వా!

27) మాట్లాడేటందుకు ధరణిపై చీమల దండులా
నాలుకలు మెండు సిరిలత మువ్వా!
ఆలోచించుటకు మాత్రం హిమవత్ పర్వతములా
తలలు బహు స్వల్పము సిరిలత మువ్వా!

28) ధనికులందు మానవత్వమును మించి
బీదలందు దౌర్భాగ్యమెక్కువ సిరిలత మువ్వా!
అందుకే ధరిత్రిపై ధనము నెర్రబారిన నేలలో
నీరు వలె జాడ తెలియకున్నది సిరిలత మువ్వా!

29) తలవంచని చోట ఈర్ష్యతో వంచిన చోట
అలుసుతో వెక్కిరించి తీరుదురు సిరిలత మువ్వా!
జీవితాన గెలుపయినా ఓటమయినా
గుండెకు బీటలు తప్పవు సిరిలత మువ్వా!

30) ఓడుతూ ఓడుతూ ఓడుతూ ఓడువడుతూ
సాగుతూనే నడిచిపో సిరిలత మువ్వా!
ఓటమందే ఓడి దారి తొలిగి నీ ముందు
ఓడిపోయి తీరునులే సిరిలత మువ్వా!

31) ఆకులలో రగులు మంటలను
అడవి దాచి ఉంచు సిరిలత మువ్వా!
గుండెలలో గుబులు దిగుళ్ళను
చిరునవ్వులు మూసి ఉంచు సిరిలత మువ్వా!

32) సమాజంలో సమత్వాన్ని తడిమి సహకారాన్ని
పొందాలనుకునే ముందు సిరిలత మువ్వా!
నేతి బీరకాయలను చిదిమి
నెయ్యి తీసి చూపెట్టు సిరిలత మువ్వా!

33) కర్మాగారానికి నడిచొచ్చే వారే గానీ నడిపించలేరు
కార్మికుల బ్రతుకే పెట్టుబడయినా సిరిలత మువ్వా!
కూలి చీమలు ఎంత కూడబెట్టి పుట్టకట్టినా
రెక్కలెన్నడూ మొలుచుకురావు సిరిలత మువ్వా!

34) గుండెల్లో గునపాలు దింపినా మూల్గలేని
మూగ హృదయాలు కొన్ని సిరిలత మువ్వా!
బాధ్యతల బండల బరువుకు ఆనందపు
శిలాజాల ఆనవాళ్ళవి సిరిలత మువ్వా!

35) ఆ కనులు రెప్పలెత్తి వెతికినా అటు చూడబోకు
అవి ప్రేమజల సుడిగుండాలు సిరిలత మువ్వా!
ఒకసారి పడితే ఒడ్డు చేరేది లేదు
బ్రతుకంత సుడివడిలో చుట్టుకు తిరిగినా సిరిలత మువ్వా!

36) గురిగింజ ఎరుపెంత ఎగచూపి తిరిగినా
తనలోని నలుపు దాచగలుగునా సిరిలత మువ్వా!
ఎదుటి వారిలోని తప్పులెంచి చూపినా
తమలోని తప్పు దాగి ఉండునా సిరిలత మువ్వా!

37) ఆత్మలు చంపుకుని మానవులు
యధేచ్ఛగా సంచరించుచుండ సిరిలత మువ్వా!
అబద్ధాలే అందలాలెక్కి
అలవోకగా రాజ్యమేలుచున్నవి సిరిలత మువ్వా!

38) వ్యవస్థ అహంకారపు హోదాలకు కట్టుబడిన
జీవంలేని భూచరాల సంచారాలు కొన్ని సిరిలత మువ్వా!
శరీరాలను కుళ్ళిపోకుండా చూసుకునే
ఖరీదయిన శవాల చరిత్ర సాక్ష్యాలవి సిరిలత మువ్వా!

39) పెదవులు కదలకపోయినా
కనులు చెప్పవా గుండె ఊసులు సిరిలత మువ్వా!
మాటలు లేకపోయినా
మౌనం విప్పదా పండే బాసలు సిరిలత మువ్వా!

40) అలకలు కలికికి చెల్లునులే
అలవోకలు అందరికీ అందములే సిరిలత మువ్వా!
కులుకులు తరుణికి ఒప్పనులే
తళుకులు పదుగురికీ చెందునులే సిరిలత మువ్వా!

41) వంతులు గలవారికి చింతల అలజడి
చింతలు గలిగిన వారికి చిత్తమే అలజడి సిరిలత మువ్వా!
ధరణిలో అందరూ ఆగర్భ శత్రువులే
సిరులెన్ని చెంత ఉన్నా చింతా దరిద్రులే సిరిలత మువ్వా!

42) నవ్వుకొనడానికి అంగట్లో ఎన్నెన్నో
ఆస్థో, అధికారమో అదుపులో ఉంటే సిరిలత మువ్వా!
నవ్వుకొనడానికి మోము ముంగిట్లో
కాస్తో, కూస్తో మనసు ఉండి తీరాలి సిరిలత మువ్వా!

43) నిజాలు నిప్పులైనా నివురుకప్పి
గుండెలు గుట్టుగా కప్పి పెడుతుంటాయి సిరిలత మువ్వా!
ఇజాలుగా మారి ఎగదన్ని ఎగిసిపడి
మండే రోజు కొరకు తప్పక ఎదురుచూస్తుంటాయి సిరిలత మువ్వా!

44) పుష్ప గీతికను కాలేను లాలిత్యము సరిపోదు
తంత్రి మూర్ఛనలు పోలేను మాధుర్యం మరిరాదు సిరిలత మువ్వా!
ఓటమి ప్రసవించిన ఓ గుండె ఢమరుకము నేను
దిక్కుల మారుమ్రోగించి నిశ్శబ్దాన్ని చెరిపి తీరతాను సిరిలత మువ్వా!

45) జీవిత నాటక రంగస్థలమిది
అందరూ ప్రముఖ పాత్రధారులే సిరిలత మువ్వా!
ఏ పాత్రకా పాత్ర నటనా సూత్రమే
జీవన పాత్రము ఏ పాత్ర కూడా కాదు సిరిలత మువ్వా!

46) చీకటే కమ్ముకోకుంటే
వెలుగుకు విలువ లేదు సిరిలత మువ్వా!
మరణమే మరి రాకుంటే
బ్రతుకులో తీపిలేదు సిరిలత మువ్వా!

47) వానపామ్మై జరుతున్నాళ్ళూ అడుసులోకి
అడుగులు తొక్కిపెడతాయి సిరిలత మువ్వా!
నాగుపామ్మై పడగ విప్పాలపుడపుడు బుసకు
బెదిరి దారి తొలిగి తీరతాయి సిరిలత మువ్వా!

48) అపనమ్మకపు అగాధం పూడ్చకపోతే
మనిషికీ, మనిషికీ మధ్య సిరిలత మువ్వా!
మమతల వారధి వెలవడం దుర్లభం
మనసుకీ మనసుకీ నడుమ సిరిలత మువ్వా!

49) కోడి ఘర్షణలకు నలిగి నశించి
ముకుళించిన హృదయ కుసుమాలె సిరిలత మువ్వా!
చిట్టి వర్షపు జల్లుకే విరియగల
స్వాంతన పొందే శక్తి కలిగి ఉండునులే సిరిలత మువ్వా!

50) ముసుగులో తప్పలెన్ని చేసినా
మూలమసలు అడగదు లోకం సిరిలత మువ్వా!
వెలుగులో ఒక తప్పకు ఎదురు తిరిగితే
చితుకులు పట్టించి తీరు బతుకు సిరిలత మువ్వా!

51) ఎదుటి వారి లోపాలను ఎక్కువగా
వెతికి వెలుగులోకి తెచ్చేదెవరంటే సిరిలత మువ్వా!
తమలో లోపాలెక్కువై పాపాల భయాన
పక్క కుదరని పిరికివాళ్ళంట సిరిలత మువ్వా!

52) జీవితమే కోరికల మయం
ప్రతి కోరికా పరమప్రాణం సిరిలత మువ్వా!
తీరని కోరికలే గుండెను నిండు
తీరిన కోరికల కన్నా సిరిలత మువ్వా!

53) రెప్పకంటిని కాపాడుతూనే ఉండును
కంటి వెలుగు ఆరేవరకూ సిరిలత మువ్వా!
తల్లి బిడ్డను తడుముకుంటూనే బ్రతుకును
తాను బ్రతికి ఉన్నన్నాళ్ళూ సిరిలత మువ్వా!

54) ఎదుటి వారిని తిట్టవలసి వచ్చినపుడు
శాంతిగా నవ్వి ఊరుకోవడం మానవత్వం సిరిలత మువ్వా!
ఎదుటి వారు గేలి చేస్తున్నపుడూ
జాలిగా నవ్వి ఊరుకోవడం మహర్షితత్వం సిరిలత మువ్వా!

55) ప్రశాంతంగా ప్రకృతిని ప్రేమిస్తూ
సహజంగా బ్రతికేవాడు పిచ్చివాడంట సిరిలత మువ్వా!
రెచ్చిపోయి నినాదాలు నిరంకుశత్వాలు
ప్రదర్శించే పిచ్చివాడు మంచివాడంట సిరిలత మువ్వా!

56) ఎవరిచేతా ప్రేమించబడని జీవితాలు కూడా
జీవించాలని ఆరాటపడతాయి సిరిలత మువ్వా!
ఎవ్వరినీ ప్రేమించలేని జీవితాలు మాత్రం
జీవించినా పోరాటపడతాయి సిరిలత మువ్వా!

57) చెయ్యిలేని గుండెల్లో
ఆశయాలు మెండు సిరిలత మువ్వా!
చెయ్యి కలిగిన మైండులో
ఆశలు మాత్రమే నిండు సిరిలత మువ్వా!

58) బ్రతికినన్నాళ్ళు నాది నాదంటూ
జవురుకుని బ్రతికేవు సిరిలత మువ్వా!
చావు వచ్చినాడు తోడు రాకేదీ
బావురుమంటు బయలెల్లిపోతావు సిరిలత మువ్వా!

59) మమీకృతం లోంచి పుట్టే శాంతి
వెన్నెల వంటి చల్లనిది సిరిలత మువ్వా!
ప్రళయాకృతం తరువాత పుట్టే శాంతి
భయంకరమైన ఎర్రని మౌనం వంటిది సిరిలత మువ్వా!

60) స్త్రీ బ్రతుకుకు మాతృ ప్రేమ మధురం
బాధ్యత నిండిన బలహీనత సిరిలత మువ్వా!
బలి పశువల్లె సమాజపు అధికారానికి
బలాన్నిస్తూ బ్రతుకును బద్దలు చేస్తుంది సిరిలత మువ్వా!

61) హిమవత్ పర్వతం వైపు
తడబడినా అడుగులు సాగించు సిరిలత మువ్వా!
అగాధాల అంచుల వైపు
ఆలోచనలసలు జారనీకు సిరిలత మువ్వా!

62) నువ్వు ఉపయోగపడేంత వరకూ
అందరికి ఆత్మీయులే సిరిలత మువ్వా!
నువ్వు నిరుపయోగమైతే
వాళ్ళే ఆత్మఘోషలు సిరిలత మువ్వా!

63) సంద్రంలో నీళ్ళెన్ని నిలిచినా
పైరు పంటకు పనికి రాదు సిరిలత మువ్వా!
పిసినారి ఖజానాలో డబ్బెంత నిండినా
గైరు హాజరు మంచి పనికి సిరిలత మువ్వా!

64) ధనము తోడుంటే అందరూ
ఆప్త బంధువులే సిరిలత మువ్వా!
కలిమి చెంతనుంటే ప్రతి ఒక్కరు
అపర రాబంధులే సిరిలత మువ్వా!

65) లోకుల ఆచరణకే లోకోక్తులు
చెప్పి ఒప్పించేది సిరిలత మువ్వా!
తన వరకు వస్తే సాకోక్తులు
చెప్పి తప్పించుకునేది సిరిలత మువ్వా!

66) అన్నీ తెలిసిన ఆప్త మిత్రుడే
అన్నింటికీ అండ సిరిలత మువ్వా!
రేపటినాడు అతను తప్పక
ఆగర్భ శత్రువేనని తెలుసుకో సిరిలత మువ్వా!

67) మంచితనం దాచుకున్నవాడు చెడ్డవాడు
చెడ్డతనం దాచుకున్నవాడు మరీ మంచివాడు సిరిలత మువ్వా!
మంచికీ, చెడుకూ ఒకటే తేడా జగతిలో
పది మంది నాలుక మీద తీపి రాయడమే సిరిలత మువ్వా!

68) ప్రేమిస్తూ పోతే ఊబిలోన ఊరట
పైకి రాలేక బలవంతపు మునక సిరిలత మువ్వా!
ప్రేమించబడితే హిమాలయాధిరోహం
కిందకు దిగలేని ఒంటరితనం సిరిలత మువ్వా!

69) విరిలోని తేనియ పీల్చితే రాదు
విరబూసి విందులు చేస్తేనే పొందు సిరిలత మువ్వా!
హృదయంలో ప్రేమ పిలిస్తే రాదు
స్పందించి అనురాగం చిందిస్తేనే సిరిలత మువ్వా!

70) ఒక్క సిద్ధాంతాన్ని పట్టుకుని
వేలాడే కలం వ్యర్థం సిరిలత మువ్వా!
అన్ని సిద్ధాంతాలూ ఔపాసన పట్టి
న్యాయం చూపించేదే ఇలకు అవసరం సిరిలత మువ్వా!

71) ఆకాశానికి నిచ్చెనలు వేసి
అవస్థలలో జారిపడకు సిరిలత మువ్వా!
పచ్చికలో నింపాదిగ నడిచి
చేరుకో జీవిత లక్ష్యం సిరిలత మువ్వా!

72) ధనం హోదా పరువు ప్రతిష్ట
ఏనాడో ఓనాడు వీడిపోతాయి సిరిలత మువ్వా!
జ్ఞానం, త్యాగం, సాయం, సత్యం
మరణించినా బ్రతికుంటాయి సిరిలత మువ్వా!

73) నీ వాళ్ళు నిన్ను విడిచారని వగపెందుకు
అవన్నీ శారీరక బంధాలు సిరిలత మువ్వా!
నీ శరీరాన్ని ఓనాడు శ్మశానంలో కాల్చి
ఇల్లు చేరుకుంటాయవి సిరిలత మువ్వా!

74) జీవితం బయటకు రానీని పద్మవ్యూహం
బాధల ఆయుధాల గాయాలు తప్పవు సిరిలత మువ్వా!
గెలిస్తే రాచపుండ్లతో రాజ్యాధికారం
ఓడితే ఆత్మగౌరవానికి శిరచ్ఛేదం సిరిలత మువ్వా!

75) సరికాని వారితో కలిపే స్నేహం
ఉబుసుబోక ఉరివేసుకోవడం సిరిలత మువ్వా!
సమ ఉజ్జీతో శతృత్వమైనా గాని
మంచి చెడులు సరిచూసుకోవడం సిరిలత మువ్వా!

76) ఆకలికి మాడేటి కడుపుకు
అడిగినా పిడికెడు పెట్టనేరరు సిరిలత మువ్వా!
బొజ్జ పెంచి కూర్చున్న ఆసాములకు
పట్టి పట్టి ఫలహారాలు పెడుదురు సిరిలత మువ్వా!

77) మంచితనానికి గురుతొకటే
ధరణిపై నెక్కడయినా సిరిలత మువ్వా!
నేరమే చేయకుండా పరులలో
నిందితులగుదురు వారు సిరిలత మువ్వా!

78) బిందెడు పాలను ఒక్క ఉప్పగల్లు
విరిచినట్లుగానే సిరిలత మువ్వా!
వందల సుఖపు యుగాలను
ఒక విరక్తి క్షణం విదిలిస్తుంది సిరిలత మువ్వా!

79) అభిమానమున్న వారికి
మాటపడుట కంటె మరణం మేలు సిరిలత మువ్వా!
ఇలలో మాట పడనివాడు
మరణించని వారు అసలు లేరు సిరిలత మువ్వా!

80) దెయ్యాలూ, భూతాలూ మరెక్కడో
దాగిలేవు ధరణిపైన సిరిలత మువ్వా!
మనిషి మనసే ఒక నికృష్ట దెయ్యం
దానికి పనిలేకపోతే అదే భయంకర భూతం సిరిలత మువ్వా!

81) ఆకాసాన నక్షత్రాలెంచవచ్చు
ఇలపైన ఇసుక రేణువులెంచవచ్చు సిరిలత మువ్వా!
తల్లిదండ్రులను నెంచే బిడ్డల
నెంచుట అసాధ్యము పుడమిలో సిరిలత మువ్వా!

82) రెక్కలు తడియారక ముందే బిడ్డను గూటి నుండీ
క్రిందకు నెట్టి ఎగరడం నేర్పును పక్షులు సిరిలత మువ్వా!
ఎదిగిన బిడ్డలను సైతం తమ రెక్కల కింద
అణిచి పెట్టుదురు కొందరు మూర్ఖులు సిరిలత మువ్వా!

83) బాల్యం నిన్ను వీడిందని
బావురుమని విలపించుటెందుకు సిరిలత మువ్వా!
అమ్మ పేగు తెంచుకున్నామని
అమ్మతనం పోతుందా బ్రతికినన్నాళ్ళు సిరిలత మువ్వా!

84) ఆత్మ ఆత్మతో కలిశాక కలిగే ఎడబాటు
శరీరాల ఎడబాటే గానీ సిరిలత మువ్వా!
మనసుల తడబాటు మమతల తెగుబాటు
కానేరదు మంచి మనసులకు సిరిలత మువ్వా!

85) కలిమిని మించిన చెలిమి
వలపును మించిన బలిమి సిరిలత మువ్వా!
వాటిని మించినవి మనిషి పొందితే
అది బ్రతుకు నాటకంలో మరో రంగం సిరిలత మువ్వా!

86) మంచితనం పెంచుకోవడానికి
మానవ జీవితం అంతా పట్టును సిరిలత మువ్వా!
దాన్ని తెంచి పారవేయడానికి
క్షణంలో సగం చాలు నిక్కము సిరిలత మువ్వా!

87) అంతా మంచి జరిగితే మాత్రం
అందురు మనం మనం అని కలగలుతురు సిరిలత మువ్వా!
కొంచెం చెడు జరిగితే మాత్రం
నువ్వు నువ్వని చూపుడు వేలెత్తుదురు సిరిలత మువ్వా!

88) జరిగిన జ్ఞాపకాలలోకి జారిపోతూ
నిన్నను ఈరోజు చేసుకుంటే ఫలితమేమి సిరిలత మువ్వా!
జరగబోయే భవిష్యత్తులో తేలిపోతూ
ఈరోజును రేపు చేసుకుంటే తెలివికాదా సిరిలత మువ్వా!

౮౯) సౌందర్యారాధన చేతకాదు అందరికీ
సౌందర్యం నలపడమే సంతసం కొందరికీ సిరిలత మువ్వా!
స్త్రీత్వం దర్శించ వీలుకాదందరికీ
స్త్రీని అనుభవించుట సంతోషం ఎల్లరికీ సిరిలత మువ్వా!

౯౦) సుఖం దుఃఖం మనసుకున్న రెండే రెండు
లక్షణావశేషాల తాలూకు నీడలు సిరిలత మువ్వా!
మనిషి జన్మలో భూత భవిషత్ వర్తమానాలలో
వేటిని తలుచుకుంటే అవే వెంట నడుస్తాయి సిరిలత మువ్వా!

౯౧) జనాల కోసం బ్రతికేటప్పుడే
జనాల మధ్య ఉండడం సిరిలత మువ్వా!
మన కోసం మనం బ్రతికేటపుడు
ఏకాంతమే ఉత్తమం సిరిలత మువ్వా!

౯౨) కవి కలం సాగటం మాని విరామం
కోరేదెపుడంటే సిరిలత మువ్వా!
కవి గుండె స్పందన మాని
నిశ్శబ్ధం పేరినపుడే సిరిలత మువ్వా!

౧3) మతాలన్నీ ఎడారిలో మభ్యపెట్టు
ఎండమావులు దాహార్తి మానవునికి సిరిలత మువ్వా!
సన్మతమను ఒయాసిస్సు చేరి చూడు
బ్రతుకునిచ్చు అది బహురమ్యముగ సిరిలత మువ్వా!

౧4) తల తెగే వరకూ గొర్రెకు తెలియదు
కసాయివాడ్ని నమ్మకూడదని సిరిలత మువ్వా!
మోసం చేసే వరకూ మహిళకు తెలియదు
మగవాడు మోసగాడని సిరిలత మువ్వా!

౧5) ప్రతి గొప్పవాడు బ్రతికుండగా
తిప్పలు పడ్డ పిచ్చివాడు సిరిలత మువ్వా!
చనిపోయాక అతని గొప్పతనం
అందరికీ ఆకట్టు సిరిలత మువ్వా!

౧6) రాత్రిని ఉదయం తరమకపోతే
చీకటి బ్రతుకుల జంపును సిరిలత మువ్వా!
గతాన్ని వర్ధమానం మరవకపోతే
భవిషత్‌ను బాధ చంపును సిరిలత మువ్వా!

౭౭) చదువు మనిషికి ఒంటరితనంలో
విజ్ఞాన విజయాన్నిస్తుంది సిరిలత మువ్వా!
సంస్కారం మనిషి కలిసి మెలిసే
విశాల హృదయాన్ని సిరిలత మువ్వా!

౭౮) సంస్కృతి వెంట మనిషి నడిచినపుడు
శాంతి సామరస్యాలు నెలకొనును సిరిలత మువ్వా!
మనిషి వెంట సంస్కృతి నడిపినపుడు
మారణ హోమాలు తప్పవు సిరిలత మువ్వా!

౭౯) మేధావులకు శరీర సుఖం
తృప్తి నివ్వ నేరదు సిరిలత మువ్వా!
శ్రామికులకు మేధాస్సు
అప్రస్తుతం కాగలదు సిరిలత మువ్వా!

౧౦౦) దేశమంటే ప్రజలోయ్
మరి ప్రజలంటే ఎవరోయ్ అంటే సిరిలత మువ్వా!
నాగరికులమనే నగరంలోని వారు కాదోయ్
పల్లె పల్లెలో నిండిన పరమ పేదలోయ్ సిరిలత మువ్వా!

101) కపోతాలే కల్లోలం రేపితే
క్రూర మృగాలు జాలి చూపుతాయా సిరిలత మువ్వా!
మానవతావాదులే మారణహోమం చేసే
ఆటంకవాదులు ఆదమరుస్తారా సిరిలత మువ్వా!

102) ఇద్దరు శతృవుల మధ్య పచ్చగడ్డి వేస్తే
భగ్గుమన్నట్లుగానే సిరిలత మువ్వా!
ఇద్దరు స్నేహితుల మధ్య నిప్పరవ్వ వేస్తే
మంచుగడ్డ పెరగ గలగాలి సిరిలత మువ్వా!

103) మచ్చిక చేసి మనిషి
క్రూర మృగాన్నయినా మార్చగలడు సిరిలత మువ్వా!
మూర్ఖత్వం నిండిన మనిషి
ఇసుమంతయినా మార్చలేడు సిరిలత మువ్వా!

104) ఎదుటి వారిని ద్వేషించడమే
లక్ష్యంగా పెట్టుకున్నపుడు సిరిలత మువ్వా!
వారిలో చెడును చెడుగాను
మంచిని చెడుగాను గోచరించును సిరిలత మువ్వా!

105) సహృదయమున్న స్నేహం ఏర్పడడానికి
జీవితంలో సగభాగం పట్టినా పట్టవచ్చు సిరిలత మువ్వా!
అదే స్నేహం శత్రుత్వమవడానికి
క్షణంలో రెండో భాగం చాలు సిరిలత మువ్వా!

106) పండ్లతో కూడిన పచ్చదనంతో నిండిన
చెట్టుకే రాళ్ళదెబ్బలు కొమ్మ విరుపులు సిరిలత మువ్వా!
ప్రతిఫలం ఆశించని మంచితనపు
మానవులకే పలు నిందలు అపనిందలు సిరిలత మువ్వా!

107) జీవితం ఎన్నటికీ అయిపోని
మెదడులాడే చదరంగం సిరిలత మువ్వా!
ఎదుటివారు 'చెక్' పెట్టినపుడు తప్పించుకుంటూ
వారు మైమరచినపుడు చెక్ పెడుతూ సాగాలి సిరిలత మువ్వా!

108) కక్షతో మారణాయుధాలు మలిపి శాంతిని
ఇసుమంతయినా సాధించలేము సిరిలత మువ్వా!
క్షమతో మంచి మనసును నిలిపి ప్రశాంతిని
జగమంతయునా నింపగలము సిరిలత మువ్వా!



కవయిత్రి తన అంతరాత్మకు

చేసిన విన్నపముల సమాహారం

**శ్రీలత శతకము**

ఇది దండోరా ధ్వని కాదు

కంచు ఢంకా మ్రోత కాదు

మువ్వల కల కల కలరకము... కలవరము.

నిజంగా ఈ శతకము మిరుమిట్లు గొలిపే

'మెరుపు తీగ'ల పుట్ట!